
క్లుప్తంగా

నేడు బీజేపీ ధర్నా

కుత్బుల్లాపూర్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానికులకే కేటాయించాలని, దరఖాస్తుదారులందరికి ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ దీక్షకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దరఖాస్తుదారులు, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా సుదర్శన్



రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న సుదర్శన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ప్రధానోపాధ్యాయుల అవార్డుకు ఎంపికయ్యారు. గురుమూర్తినగర్ ప్రభుత్వ పాఠశాలలో ఆయన 2015 నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. ఉత్తమ అవార్డుకు ఎంపికైన సుదర్శన్ మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రుల ప్రశంసలే తనకు పెద్ద అవార్డు అని, 98 శాతం ఉత్తీర్ణత శాతంతో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సైతం తమ పాఠశాలలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఉత్తమ విద్యనందించడంతో పాటు పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచామన్నారు. తన 35 సంవత్సరాల ఉపాధ్యయవృత్తిలో విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం సంతోషంగా ఉందని, సహచర ఉపాధ్యాయుల కృషి, సహకారంతోనే ఇది సాధ్యపడిందన్నారు.

మెగా హెల్త్ క్యాంప్



వివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో మెగా హెల్త్ క్యాంప్‌కు హాజరైన జనం

జీడిమెట్ల: సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో ఆదివారం నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన క్యాంప్‌లో జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్, దంత, ఆర్థో, గైనకాలజీ తదితర సమస్యలతో బాధపడుతున్న 500 మందికి ఉచితంగా చెకప్ చేసి మందులను అందజేశారు. ఈ శిబిరంలో వైద్యులు రాజేష్, అపర్ణ, ఇమ్రాన్ అలీ, ధనలక్ష్మి, వనజ లు రోగులకు ఆరోగ్య సంబంధిత సలహాలు, సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండవ శ్రీనివాస్‌గౌడ్, కరెస్పాండెంట్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది



సుభాష్‌నగర్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ప్రయోజకులుగా మార్చే ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సూరారం డివిజన్‌కు చెందిన ఉపాధ్యాయురాలు శారద జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా తెలంగాణ స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డును ఈనెల 5న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదిగా అందుకోనున్నారు. ఆదివారం కార్పొరేటర్ సత్యనారాయణ శారద దంపతులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. శారద భర్త కూడా ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు.

కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయం

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జేకే శేఖర్‌యాదవ్ అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలోని సెవల్ హిల్స్‌లోని శివాలయంలో హోమం నిర్వహించగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో జరిగిన అనంతరం 300 మంది బీజేపీ లో చేరగా ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి లు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పున్నారెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, అరికల సుధ, వసుంధర, అరుణారెడ్డి, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మధ్య కోల్డ్‌వార్!



- డబుల్ ఇళ్ల పంపిణీకి హాజరుకాని ఎమ్మెల్సీ
- ఆహ్వానం రాలేదంటున్న ఎమ్మెల్సీ వర్గం
- టికెట్ కేటాయించినప్పటి నుంచి ఎమ్మెల్యేకు దురంగా ఉంటున్న ఎమ్మెల్సీ వర్గీయులు
- ప్రజాప్రతినిధుల్లో కొందరు తప్ప అందరూ గైర్హాజరు
- ఒక్క మున్సిపల్ చైర్మన్ కూడా రాని వైనం
- అభ్యర్థిగా ప్రకటించినా బీఫామ్ ఇవ్వరంటున్న ఎమ్మెల్సీ వర్గీయులు

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ల మధ్య కోల్డ్ వార్ తీవ్ర రూపం దాలుస్తోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ రోజు ఎమ్మెల్సీ రాజు వర్గానికి చెందిన ఏ ఒక్కరూ ప్రజాప్రతినిధి, నాయకులు హాజరు కాకపోవడం చర్చగా మారింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో శనివారం జరిగిన ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు ఇద్దరు ఎమ్మెల్యేలు కృష్ణారావు, వివేకానంద హాజరైనా ఈ కార్యక్రమానికి శంభీపూర్‌రాజు డుమ్మా కొట్టడంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధ్య మరింత దూరం పెంచిందనే చెప్పుకోవచ్చు. ఆహ్వానం లేదని ఎమ్మెల్సీ వర్గం.. ఉన్నా కావాలనే తప్పించుకున్నారని ఎమ్మెల్యే వర్గం ఒకరినొకరు విమర్శించుకుంటున్నారు. దీంతో ద్వితీయశ్రేణి నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

మంత్రి హరీష్‌రావు చొరవ తీసుకున్నా...

కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే వివేకానంద్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన నాటి నుంచి ఎమ్మెల్సీ వర్గీయులు మొత్తం ఎమ్మెల్యేకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇరువురు నేతలు ఒకరి ఇంటికి ఒకరు వెళ్లి ఒకరికి ఒకరు దొరక్కుండా దోబూచులాడారు. చివరకు ఎమ్మెల్సీ రాజు ఇంట్లో ఎమ్మెల్యే వివేకానంద భేటీ కావడంతో ఇక సమస్య పరిష్కారం అయిందని అందరూ భావించారు. మంత్రి హరీష్‌రావు చొరవతో ఇలా జరిగిందని పుకార్లు షికారులు చేశాయి.

◆ కానీ ఈ నెల 2 తేదీన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయించే విషయంలో జరిగిన బహిరంగ సభకు ఇటు జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు గాని అటు నిజాంపేట కార్పొరేషన్ చైర్మన్ నీలా గోపాల్ రెడ్డి, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, దుండిగల్ మున్సిపల్ చైర్మన్ కృష్ణవేణి, కౌన్సిలర్లు ఏ ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడం గమనార్హం. అంతేకాకుండా నగర శివారు ప్రాంతాల్లో ఉన్న ఓ రిసార్ట్‌లో ప్రజాప్రతినిధులు ఉన్నట్లు పుకార్లు షికార్లు చేయడం కావాలనే ఓ పథకం ప్రకారం ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టినట్లు స్పష్టమైంది.

'బీఫాం'పైనే... ఇప్పుడు హాట్ టాపిక్.!

కుత్బుల్లాపూర్ అభ్యర్థిగా ఎమ్మెల్యే వివేకానంద్‌కు మూడోసారి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ నియోజకవర్గంలో కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులు, ప్రజాప్రతినిధులు డిలేమాలో పడ్డారు. ఒకరి వెంట తిరిగితే మరొకరు దూరమవుతారన్న నెపంతో అంటిముట్టునట్లుగా ఉంటూ వస్తున్నారు. తెలంగాణలోని వివిధ నియోజకవర్గాల్లో అభ్యర్థి విజయం కోసం ర్యాలీలు, విజయోత్సవ సభలు నిర్వహిస్తూ రాగా కుత్బుల్లాపూర్‌లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

◆ ఎమ్మెల్సీ రాజు వర్గం నియోజకవర్గ వ్యాప్తంగా శంభీపూర్ రాజుకే టికెట్ వస్తుందని ప్రచారం కల్పిస్తూ అభ్యర్థిగా ప్రకటించిన వివేకానంద్‌కు బీ–ఫాం ఇవ్వరని చెబుతూ రావడం ఇప్పుడు స్థానికంగా చర్చగా మారుతుంది. ఇటీవల ఎమ్మెల్సీ ఇంటికి ఎమ్మెల్యే వెళ్లిన సందర్భంలో సైతం ఎడమొహం.. పెడమొహం గానే మాట్లాడుకొని రెండు గంటలసేపు ఉన్నప్పటికీ తర్వాత జరిగిన పరిణామాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఏది ఏమైనాపటికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ వీరివివాదంపై దృష్టి సారించే వరకు ఇదే పరిస్థితి నియోజకవర్గంలో నెలకొని ఉంటుందని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నారు.

సమస్యలను దశలవారీగా పరిష్కరించడమే లక్ష్యం

కుత్బుల్లాపూర్: ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించడమే తన లక్ష్యమని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట్ 22 వార్డులో ఆదివారం పాదయాత్ర చేసిన ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను స్థానిక వాసులు ఫిర్యాదు చేయగా వాటిని అధికారులు దృష్టికి తీసుకువెళ్లి ప్రణాళికలు సిద్ధం చేసి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలను కలిసిన ఎమ్మెల్సీ రాజు వారి సమస్యలను విని అధికారులతో ఫోన్లలో మాట్లాడారు. మహేశ్వరం గ్రామంలో నరసింహారావు గృహప్రవేశంలో పాల్గొని పూజలు చేశారు.



మల్లంపేట్‌లో పర్యటిస్తున్న ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

ఓటర్ల నమోదుకు 16 మంది దరఖాస్తు

రంగారెడ్డినగర్: రెండో స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో శని, ఆదివారాల్లో రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శనగర్‌లోని గుడ్‌షెపర్డ్ హైస్కూల్ వద్ద నిర్వహించిన స్పెషల్ క్యాంపెయినింగ్‌కు స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. రెండు రోజుల పాటు జరిగిన ఓటర్ల నమోదుకు 16 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా పలువురు ఓటర్లు తమ పేర్లలో తప్పులు, అడ్రస్ మార్పుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

పోలింగ్ బూత్‌ల ఏర్పాటు అభినందనీయం



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పోలింగ్ బూత్‌ను సందర్శించిన జెమ్మి దేవేందర్

కుత్బుల్లాపూర్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొంపల్లికి చెందిన సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జెమ్మి దేవేందర్ అన్నారు. ఆదివారం ఆయన కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జయభేరి కాలనీ, పీఎస్ఎన్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను సందర్శించారు.

◆ ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. ప్రజలకు రెండు కిలోమీటర్ల లోపల పోలింగ్ బూత్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కలిసి అభ్యర్థించమన్నారు. అందులో భాగంగా కొత్తగా మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. పోలింగ్ బూత్‌ల సమీపంలో ఉన్న జయబేరి కాలనీ, ఎన్‌సీఎల్, నోబుల్ కాలనీల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

కార్మికుల సంక్షేమానికి ఎంత వరకైనా పోరాడతా



కె.ఎం.ప్రతాప్‌ను కలిసిన జెమ్మి దేవేందర్, భైరి ప్రశాంత్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమం కోసం ఎంత వరకైనా పోరాడతానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె.ఎం.ప్రతాప్ అన్నారు. కొంపల్లిలోని ప్రతాప్ ఫుడ్ ప్యాకేజీ పరిశ్రమలో గత 17 సంవత్సరాలుగా పనిచేస్తున్న 107 మంది కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా విధుల్లోంచి తొలగించింది. ఆదివారం పరిశ్రమ నుంచి తొలగించిన కార్మికులు బీఆర్ఎస్ నేత జెమ్మి దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ప్రతాప్‌ను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఆయన పరిశ్రమ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

నేడు స్టూడెంట్స్ ఎంపవర్‌మెంట్‌పై చాగంటి ప్రసంగం

నిజాంపేట్: స్టూడెంట్స్ ఎంపవర్‌మెంట్‌పై సోమవారం బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకుడు చాగంటి కోటేశ్వరరావు ప్రసంగించనున్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కళాశాలలోని కోడే సత్యనారాయణ ఆడిటోరియంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు ఆయన వ్యక్తిత్వ వికాసం, జీవితంలో విజయం సాధించడానికి అవలంభించాల్సిన పద్ధతులపై సూచనలు, సలహాలు ఇవ్వనున్నారని కళాశాల యాజమాన్యం ఓ ప్రకటనలో పేర్కొంది.

వధూవరులకు ఆశీర్వాదం

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి కుమారుడి వివాహం ఆదివారం కేవీఎస్ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ వివాహానికి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ రాజశేఖర్‌రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు హాజరై వధువరులను ఆశీర్వదించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



దుండిగల్: దుండిగల్‌లోని శ్రీరాజరాజేశ్వరి, పోచమ్మ ఆలయంలో ఆదివారం యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాలు, జాతర మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 6.30 గంటలకు అమ్మవార్ల దివ్య దర్శనం, అర్చనలు, ఒడి బియ్యం సమర్పణ, వాహన పూజలు, సాయంత్రం 4 గంటలకు ఘటం ఊరేగింపు అనంతరం బోనాలు సమర్పించారు. దీంతో దుండిగల్ గ్రామంలో పండగ వాతావరణం సంతరించుకుంది. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ అమ్మవారిని దర్శించుకున్నారు.



భక్తులతో ఆలయ ప్రాంగణం

ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్

- దురుసుగా జవాబు ఇచ్చిన డ్రైవర్‌పై చేయి చేసుకున్న ట్రాఫిక్ సీఐ

జీడిమెట్ల: ఓ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ర్యాష్ డ్రైవింగ్, దురుసు ప్రవర్తన ట్రాఫిక్ సీఐకు చిర్రెత్తించింది. డ్రైవర్ ప్రవర్తనతో చిర్రెత్తిపోయిన ట్రాఫిక్ సీఐ డ్రైవర్‌పై చేయిచేసుకున్నాడు. ఈ సంఘటన జీడిమెట్ల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల,పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి ఇందు ట్రావెల్స్‌కు చెందిన బస్సు (ఎన్ఎల్01బి2678)ను రంగా భుజంగా వద్ద డ్రైవర్ ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తూ వస్తున్నాడు. ఇది గమనించిన జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు బస్సును ఆపేందుకు ప్రయత్నించగా డ్రైవర్ ఆపలేదు.

◆ మరలా పోలీసులు కుత్బుల్లాపూర్ చౌరస్తాలో ఆపేందుకు ప్రయత్నించిన డ్రైవర్ ఆపలేదు. ఎట్టకేలకు పోలీసులు సదరు బస్సును ఐడీపీఎల్ చౌరస్తాలో నిలవరించారు. ట్రాఫిక్ సిబ్బంది బస్సు డ్రైవర్‌ను ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించాడు. దీంతో సిబ్బంది ఈ విషయాన్ని సీఐకు సమాచారం అందించారు. అనంతరం అక్కడకు చేరుకున్న జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి సదరు డ్రైవర్‌ను బస్సు నుంచి కిందకు దింపి ఎందుకు ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నావని చేయి చేసుకున్నాడు. డ్రైవర్‌పై సీఐ చేసుకోవడాన్ని సోషల్ మిడియాలో షేర్ చేయడంతో ఇది నెట్టింట్లో వైరల్ అయిపోయింది. ట్రాఫిక్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడం, ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తూ నిర్లక్ష్యంగా జవాబు ఇస్తుండటంతోనే చేయి చేసుకున్నానని ట్రాఫిక్ సీఐ ‹సాక్షి›కి తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రాత్రి 10.30 గంటల తర్వాతే సిటీ రోడ్లపైకి రావాలి. కానీ 10గంటలకు వచ్చి నిర్లక్ష్యంగా బస్సు నడిపాడని తెలిపారు.

ఓటరు నమోదుకు విశేష స్పందన



పోలీంగ్ బూత్‌ను సందర్శించిన కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నాగమణి

కుత్బుల్లాపూర్: రెండో స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా శని, ఆదివారాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ క్యాంపెయినింగ్ నిర్వహించగా ఓటర్ల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 582 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండగా పలువురు వచ్చి తమ పేర్లు ఉన్నాయో లేవో బూత్ లెవెల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పారదర్శకంగా ఓటరు జాబితాను తయారు చేసే క్రమంలో అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ముందస్తుగా ఓటు నమోదు చేసుకోవచ్చని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు సూచించారు.

◆ నూతన ఓటరు నమోదు దరఖాస్తు–6, ఆధార్ అనుసంధానం దరఖాస్తు–6బీ, ఓటరు జాబితా అభ్యంతరాలు ఓటర్ తొలగింపునకు దరఖాస్తు–7, మార్పులు చేర్పులకు దరఖాస్తు–8, సెప్టెంబర్ 19వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో ఉప కమిషనర్లు నాగమణి, మల్లయ్యలు ఇతర అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి పూర్తి నివేదికను తయారు చేసే పనిలో ఉన్నారని పేర్కొన్నారు.

నిజాంపేట్‌ను ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం



క్రాంతినగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం రూ.5.24 కోట్ల నిధులతో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కమిషనర్ రామకృష్ణారావు, కౌన్సిలర్ విజయలక్ష్మిలతో కలిసి శంకుస్థాపన చేశారు. క్రాంతినగర్ కాలనీలో రూ.47.50 లక్షలతో సీసీ రోడ్డు, రూ. 20. లక్షలతో పార్కులో చిల్డ్రన్స్ ఎక్యూప్‌మెంట్, రూ.80 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, కేసీఆర్ కాలనీలో రూ. 24 లక్షలతో సెంట్రల్ లైటింగ్, రూ.40 లక్షలతో డ్రైనేజీ లైన్, బొంగులకుంటలో రూ.71 లక్షలతో పార్కు, ప్రణీత్ ప్రణవ్ అంటిలియా నుండి మొండికుంట చెరువు వరకు రూ.75 లక్షలతో వాటర్ స్ట్రామ్ లైన్, రూ. 1 కోటితో దుయ్యాలాకుంట పార్కు, రెయిన్‌బో కాలనీలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు, బ్లాక్ డైమండ్ లేఅవుట్‌లో రూ. 50 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.

◆ ఎమ్మెల్యే మాట్లాడుతూ పురపాలక మంత్రి కేటీఆర్ సహకారంతో అభివృద్ధి నిధుల విడుదలకు ఎలాంటి ఢోకా లేకుండా పనులు కొనసాగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోనే నిజాంపేట్‌ను ఆదర్శవంతమైన కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల వెంకటేష్, ఆగం రాజు, కోలన్ వీరేందర్ రెడ్డి, బాలాజీ నాయక్, సుజాత, సురేష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సలీం, వీరేశం, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, జగన్, సునీల్‌రెడ్డి, చంద్రగిరి సతీష్, సాంబశివ రెడ్డి, దశరథ్, కొమ్మరెడ్డి శ్రీనివాస్, ప్రవీణ్, రామ రావు, పొన్నం నాయుడు, శ్రీధర్ రావు, రవి కుమార్, శివాజీ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుదారుల ఇళ్లను కూల్చివేయడం దారుణం

నిజాంపేట్: జీవో 59 దరఖాస్తుదారుల ఇళ్లను కూల్చివేయడం దారుణమని.. లక్షలాది రూపాయల డిమాండ్ నోటీసులు ఇస్తే పేదలు ఎలా కడతారని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్టిఆర్ నగర్, జర్నలిస్టు కాలనీ, రాజీవ్ గాంధీ నగర్, ఇంద్రన్న కాలనీల్లో ఇటీవల రెవెన్యూ అధికారులు జీవో 59 కింద దరఖాస్తు చేసుకుని రుసుం చెల్లించని వారి ఇళ్లను కూల్చివేశారు. ఆదివారం ఉమామహేష్ కూల్చివేతలు జరిపిన ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో 59లో 2014 సంవత్సరంలో ఉన్న ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎంత ధర ఉందో అంతే డిమాండ్ నోటీసులు అందించాలన్నారు. కాని అధికారులు ఇష్టానుసారంగా లక్షల్లో డిమాండ్ నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. అధికారులు కబ్జాదారులను అనుకూలంగా వ్యవహరిస్తూ ఇళ్ల టాక్స్‌లు, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్న వారి ఇళ్లను కూల్చివేశారని తెలిపారు. తీరు మార్చుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు కృష్ణ, రాములు, చంద్రయ్య, మల్లయ్య, చంద్ర మోహన్, గట్టయ్య, జగన్, రజినీకాంత్, అశి యాదయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం

రంగారెడ్డినగర్: కాంగ్రెస్ పార్టీకి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పూర్వవైభవం తీసుకువస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. టీపీసీసీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా సొహైల్ జంట సర్కిళ్ల పరిదిలోని డివిజన్లకు సంబంధించి మైనార్టీ సెల్ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గాజులరామారం డివిజన్ అధ్యక్షుడిగా డాక్టర్ అక్బర్, రంగారెడ్డినగర్ అధ్యక్షుడిగా జలీల్‌ఖాన్, చింతల్ డివిజన్ అధ్యక్షుడిగా ఖాజాబాయ్‌లను నియమించగా వారికి భూపతిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి, మైనారిటీ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ సమీర్ ఖాన్, నీలి రహ్మతుల్లా, ఇరుగు రాధాకృష్ణ, బత్తుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తవ్వి వదిలేస్తే ఎట్లా?

కుత్బుల్లాపూర్: సర్కిల్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో గత రెండు నెలలుగా రోడ్డుపై అభివృద్ధి పనుల పేరుతో తవ్వి వదిలి వేయడంతో స్థానికంగా రాకపోకలు బంద్ అయ్యాయి. అంతేకాకుండా వర్షం పడ్డ ప్రతిసారి అటువైపు నడవడమే వీలు లేకుండా పోతుంది. ఇదే విషయంపై సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయగా ఇదిగో.. అదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నారని స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధి జహంగీర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.20లక్షల మంజూరు అయ్యాయని అన్నారు. కాంట్రాక్టర్ వచ్చి తవ్వకాలు చేపట్టి వెళ్లాడని, ఇదేమని ప్రశ్నిస్తే రేపు మాకు అంటూ నెట్టుకొస్తున్నారని, ఈ విషయంపై వెంటనే అధికారులు స్పందించి పనులు చేపట్టాలని లేని పక్షంలో సర్కిల్ కార్యాలయం వద్ద కాలనీవాసులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



శ్రీనివాస్‌నగర్ కాలనీలో డ్రైనేజీలైన్ వేసి రోడ్డు వేయకుండా వదిలేసిన దృశ్యం

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

నిజాంపేట్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి నందనవనం కాలనీలోని సాయి భాస్కర్ అపార్ట్‌మెంట్స్‌లో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో తలసీమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమయానికి రక్తం అందుబాటులో లేకపోవడంతో చాలా మంది ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని, ఆరోగ్యంగా ఉండి 18 సంవత్సరాల వయసు దాటిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆదుకోవాలని కోరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రక్తం కావాల్సిన వారు రామకృష్ణ మఠం, రాష్ట్రీయ స్వయం సేవక్ సంస్థల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుంటే కావాల్సిన రక్తాన్ని దాతలను సమకూర్చేలా సహకరిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ కె. శర్మ, నిర్వహికులు అజయ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రఘురెడ్డి, రమేష్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కుత్బుల్లాపూర్: రక్తదానాన్ని మించిన దానం మరొకటి లేదని బీజేపీ నాయకుడు, కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బాచుపల్లిలోని నందనవనంకాలనీ సాయి భాస్కర అపార్ట్‌మెంట్స్‌లో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని ఆయన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదాల బారిన పడి ఆపదలో ఉన్న వారికి రక్తం అవసరం ఎంతో ఉందని, రక్తదానం ద్వారా అలాంటి వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నందనవనం కాలనీ బీజేపీ నాయకులు అజయ్‌కుమార్ రెడ్డి, రంగరాజు, రమేష్, కృష్ణారెడ్డి, రఘురెడ్డి, వీరేష్, సుమన్, ఏపీ శర్మ, కష్టారెడ్డి, సూర్య, వంశీ, నరేష్, అనిల్, చరణ్, రామకృష్ణారెడ్డి, కిషోర్ బాబు, లక్ష్మణ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి జ్యూస్‌లు అందజేస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్